క్లుప్తంగా

ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే బండ్ల



గట్టు: మండల కేంద్రంలో, మాచర్ల గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు మసీదుల్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా, వారితో కలిసి ఎమ్మెల్యే, ఎంపీపీ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, మాచర్ల మాజీ సర్పంచు సిద్దిరామప్ప, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్

అయిజ: ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని ఈడుగోనిపల్లిలో మంగళ, బుధవారాల్లో (ఈనెల 9, 10 తేదీల్లో) అంతర్రాష్ట్ర ఓపెన్ కబడీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.40వేలు, రెండో బహుమతి రూ.30వేలు, మూడో బహుమతి రూ.20వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు, ఐదో బహుమతి రూ.5వేలు నగదు బహుమతి ప్రకటించారు. బుధవారం ఆలయం సమీపంలో రేలారే..రేల జానపద కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కర్ణాటక నుంచి తిరుపతికి పాదయాత్ర



మానవపాడు: కర్ణాటక నుంచి తిరుపతికి మండలంలోని చెన్నిపాడు మీదుగా సోమవారం కర్ణాటక వాసులు పాదయాత్ర నిర్వహించారు. వారు కర్ణాటక రాష్ట్రం, శేడం జిల్లా, ముతకపల్లి మండలం, వెంకటాపురం తండాకు చెందిన వారు. తండా నుంచి తిరుపతి వరకు దాదాపు 450 కిలోమీటర్లు పాదయాత్రగా తిరుమల వేంకటేశ్వరుని సన్నిధికి వెళ్తున్నట్లు తెలిపారు. చెన్నిపాడు శివారు ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన వెంకటేష్ వారికి మజ్జిగ, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. పాదయాత్రలో సంతోష్, నాగేంద్రప్ప, కిసాన్, జగనాథ్, గోవిందు, రవి, రమేష్, కుషాల్ ఉన్నారు.

దాతలకు సన్మానం



ధరూరు: మండలంలోని కోతులగిద్దలో శ్రీ అరణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల కోసం తాగునీటి ట్యాంకుతో పాటు ట్యాప్‌లను ఏర్పాటు చేసిన దాతలను గ్రామస్తులు అభినందించారు. ఆలయం వద్దకు వచ్చే భక్తులకు కనీసం తాగు నీటి వసతి లేదని గ్రహించి దాతలు ప్రకాష్‌రావు, రంగన్న, కే రంగన్న, రాములు శెట్టి, జాని, ఆంజనేయులు రెడ్డి తదితరులు దాదాపు రూ.30వేలతో నీటి వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు శ్రీనివాసరావు, కే గోవిందు, రాములు శెట్టి, రంగన్న, రాముడు, వడ్ల నర్సింహులు, కుర్వ నర్సింహులు తదితరులు దాతలను వాలువా, పూల మాలతో సన్మానించి వారిని అభినందించారు.

లారీ డ్రైవర్‌కు జరిమానా

శాంతినగర్: లారీని నిర్లక్ష్యంగా నడిపి చెట్లు విరిగిపోవడానికి కారణమైన డ్రైవర్‌కు రెండు వేలు జరిమానా వేసిన ఘటన శాంతినగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ రామేశ్వర్ తన లారీని నిర్లక్ష్యంగా నడపడంతో ఈజీఎస్‌లో నాటిన మొక్కలు విరిగిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ సిబ్బంది అతనికి రూ.2వేలు అపరాధ రుసుం విధించి వసూలు చేశారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

కేటీదొడ్డి: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి కేటీదొడ్డి మండలం పాతపాలెంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బంధువుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గడ్డం మైబుకు అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు. చివరి అబ్బాయి ఇమామ్. ఇంట్లోనే కూతురు టైలరింగ్ వర్క్ చేస్తూ ఉంటుంది. విద్యుత్ మోటారుతో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్‌ను ఇమామ్ (13) పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాబును వెంటనే గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ వైర్‌కు నీళ్ల పోయకపోవడంతో టీవీలు, ఫ్రీజ్‌లు, ఎల్రక్టానిక్ వస్తువులకు షాక్‌సర్క్యూట్ అవుతోంది. ఈ విషయంపై విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఎర్తింగ్‌లకు నీళ్లు పోయించాలని గ్రామస్తులు తెలిపారు.

ప్రతి మొక్కను కాపాడాలి



ఇర్కిచేడులోని నర్సరీలో ఏర్పాటు చేసిన షేడ్‌నెట్

- నర్సరీల్లో మొక్కలకు చలువ పందిళ్లు
- ఉపాధి హామీ సిబ్బంది ప్రత్యేక చర్యలు

కేటీదొడ్డి: ఎండలు మండుతున్నాయి. దీంతో హరిత హారం మొక్కలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుల్లో భాగంగా మొక్కల సంరక్షణకు చలువ పందిళ్లు (షేడునెట్లు) వేశారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడేందుకు ఉపాధిహామీ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కేటీదొడ్డి మండలంలోని 23 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా వన నర్సరీలు ఏర్పాటు చేసి గ్రామానికి 8 నుంచి 10 వేల మొక్కల చొప్పున నాటాలని లక్ష్యం నిర్ణయించారు. మొత్తంగా 2.30 లక్షల మొక్కలు పెంచుతున్నారు. పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా నర్సరీ చుట్టూ ప్రత్యేకంగా స్తంభాలను ఏర్పాటు చేసి చలువ పందిళ్లు వేశారు. సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం 9 గంటలలోపే సిబ్బంది మొక్కలకు నీళ్లు పడుతున్నారు.

కూలీలకు ఉపాధి..

ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో సుమారు వెయ్యి మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. కూలీలు మొక్కలను పెంచడం, నీళ్ల పోయడం లాంటి పనులు చేస్తున్నారు. మొక్కలు ఎండి పోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీలు ఏర్పాటు చేయడంతో ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉపాధి కూలీలు కూడా పని చేస్తున్నారు.

శ్రద్ధ తీసుకుంటున్నాం..

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై శ్రద్ధ తీసుకుంటున్నాం. ఎండలకు మొక్కలు చనిపోకుండా ప్రతి మొక్కను కాపాడాలనే ఉద్దేశ్యంతో చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నాం. మొక్కలను వృక్షాలుగా పెంచాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని అందులో భాగంగా మొక్కల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.

– సయ్యద్‌ఖాన్, ఎంపీఓ, కేటీదొడ్డి

రైతులకు ప్రోత్సాహం..

నర్సరీల నిర్వహణ ఆయా గ్రామాల్లో రైతులను ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రతి రైతుకు నెలకు ఆరువేల చొప్పున అందిస్తోంది. నర్సరీల ఏర్పాటుకు అవసరమయ్యే ఖర్చులు ప్రభుత్వం భరిస్తూ రైతులను మరింతగా ప్రోత్సాహిస్తోంది. దీంతో నర్సరీల నిర్వహణకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. రైతులే వన సేవకులుగా తమ సొంత పాలంలో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు.

మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన



త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను ప్రదర్శిస్తున్న బింగిదొడ్డి కమిటీ సభ్యులు

శాంతినగర్: జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరాలు తెలుసుకోవడం వల్ల మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి బింగిదొడ్డి కమిటీ సభ్యులు లక్ష్మణ్ తెలిపారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో ఉగాది సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మల సారమే త్రైత సిద్ధాంత భగవద్గీత ముఖ్య ఉద్దేశమని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వివరించారన్నారు. అనంతరం తెలుగు నూతన సంవత్సర యుగాది పండుగ రహస్యాన్ని గ్రామస్తులకు వివరించారు. సభ్యులు ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, నరసమ్మ, పద్మమ్మ, జమ్ములమ్మలు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతు చేయండి



శిథిలమైన ఉప్పల బీటీ రోడ్డు

అయిజ: అయిజ నుంచి ఉప్పలకు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు శిథిలమై సంవత్సరాలు గడిచినా అధికారులు పట్టించుకోవడంలేదు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనాలపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి అనేకసార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రాణనష్టం జరగకముందే అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు ఇలా.. ఇళ్లల్లో ఉండేదెలా?



శాంతినగర్‌లో పల్లెదవాఖాన సమీపంలో నిలిచిన మురుగు

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలికలో పారిశుద్ధ్యం లోపించింది. కాలనీల్లోని మురుగు డ్రెయినేజీల్లో కాకుండా ఖాళీగా ఉన్న ప్రైవేట్ ప్లాట్లలో నిలవడంతో సమీపంలోని ఇళ్లల్లో నివసిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దోమల ఉధృతితో పాటు, పందులు, కుక్కలు సంచరిస్తూ దుర్వాసన వెదజల్లుతోందని రామచంద్రానగర్, రామాలయ వీధి వాసులు పేర్కొన్నారు. పల్లె దవాఖాన సమీపంలో మోకాళ్ల లోతు మురుగు నిలిచినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రానగర్ కాలనీలో రోడ్లపై మురుగు పారుతుండటంతో కాలినడకన వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది స్పందించి మురుగు నిల్వకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని, రోగాల బారిన పడకుండా ప్రజలను కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ధరూరు: క్రోధ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని జాతీయ కవి సమ్మేళనంలో మండల ఉపాధ్యాయుడికి సన్మానం చేశారు. మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ టీచర్ గౌరీ శంకర్ సాహిత్య పరిజ్ఞానంతో కవితా గానాన్ని వినిపించినందుకు ఆదివారం హైదరాబాద్‌లోని సంగీత శార్వాణి, సరస్వతి ఆలయంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 120 మందిని ఎంపిక చేయగా అందులో తనకు చోటు లభించిందని ఆయన 'సాక్షి'కి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

రేపు స్లో బైక్ రేసింగ్ పోటీలు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీ గార్లపాడులో బుధవారం ఉగాది పండగను పురస్కరించుకొని గ్రామస్థాయి స్లో బైక్ రేసింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు టవర్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు పంచాయతీ కార్యాలయం దగ్గర ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనే వారు ఎంట్రీ ఫీజు రూ.100 చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండో బహుమతిగా రూ.2500 నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మద్యం పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి ఇంట్లో తనిఖీ చేయగా 41.72 లీటర్ల మద్యం పట్టుబడినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో పుల్లూరులో ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ నరేష్ అనే వ్యక్తి ఇంట్లో 41.72 లీటర్ల మద్యం పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం విలువ రూ.15,800 ఉంటుందని తెలిపారు.

అల్వలపాడులో..

ధరూరు: మండలంలోని అల్వలపాడులో మద్యం పట్టుకున్నట్లు రేవులపల్లి పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన పార్వతిబాయి అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో గ్రామానికి వెళ్లి ఇంట్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రూ.5.500 విలువైన మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



వెంకటాపురం ఆలయంలోని అమావాస్య సందర్భంగా కల్యాణం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



ఆలయంలో దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేసి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామాల్లో అమావాస్య పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ ప్రత్యేక అభిషేకాలు చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని ప్రధాన ఆలయాల్లో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి, కోతులగిద్ద అరణ్యేశ్వర స్వామి, అల్వలపాడులోని తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ధరూరులో సీతారాముల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఆయా గ్రామాల ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆకు పూజ చేసి సీతారాముల విగ్రహాలను ఆలయం చుట్టు పల్లకీలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

గట్టు: మండల కేంద్రం, మాచర్ల గ్రామాల్లోని ఆలయాల్లో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టులోని గండి ఆంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం పూలమాలలతో స్వామి వారిని అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం దగ్గర భక్తులకు గట్టుకు చెందిన మెడికల్ షాపు రవి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. మాచర్లలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం దగ్గరకు భక్తులకు కంసలి భాస్కర్ దంపతులు అన్నదానం నిర్వహించారు.

బీచుపల్లిలో అమావాస్య పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని పలు ఆలయాలు అమావాస్య సందర్భంగా సోమవారం భక్తులతో కిక్కిరిశాయి. అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆకుపూజ, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీచుపల్లి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. శివాలయం, కోదండరామస్వామి, సరస్వతీదేవితో పాటు అభయాంజనేయస్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆయా ఆలయాలలో అభిషేకం, ఆకుపూజ, అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులకు ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేసినట్లు కార్యనిర్వాహణ అధికారి రామన్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు ఉన్నారు.



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఉపాధి కూలీలకు టెంట్లు, ఓఆర్‌ఎస్ అందజేత

సాక్షి ఎఫెక్ట్..



ఉపాధి కూలీలకు టెంట్లు ఏర్పాటు చేసి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేసిన అధికారులు

కేటీదొడ్డి: ఎండలో గంటల తరబడి ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు అలసటకు గురయ్యే సమయంలో సేద తీర్చుకోవడం కోసం పని ప్రదేశాల్లో టెంట్లు వేయాలి, ఎక్కడ టెంట్లు వేసే పరిస్థితి కనబడటం లేదని ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'ఎండ దరువు..నీడ కరువు' అనే కథనంపై ప్రచూరించడంతో మండల అధికారులు ఏపీఓ అనిల్, టీఏ విద్యావతితో కలిసి సోమవారం మండలంలోని పాతపాలెం, గువ్వలదిన్నె, ఈర్లబండ, తదితర గ్రామాల్లోని ఉపాధి హామీ పనులపై పరిశీలించి కూలీలకు టెంట్లు, తాగునీరు, వడదెబ్బ తగలకుండా ఉండేందుకు కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసి వడదెబ్బ తగులకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీఎలు, ఆశావర్కర్లు, కూలీలు, తదితరులు ఉన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మానవపాడులో ఎండలో వచ్చిన మహిళకు ఓఆర్‌ఎస్ నీరు అందిస్తున్న వైద్యసిబ్బంది

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ రిజ్వానా తాన్విర్ ఆధ్వర్యంలో వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బయట తిరుగరాదని తెలిపారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం 11గంటలలోపు ఇంటికి చేరుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు ఎండలో ఆడుకోరాదని, నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, ద్రవపదార్థాలు ఎక్కువ తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని నీడ గల ప్రదేశానికి తీసుకెళ్లి, చల్లని నీటితో తడిపిన గుడ్డతో శరీరం తుడవాలన్నారు. ఓఆర్‌ఎస్ నీళ్లు తాగించాలని, 1లీటర్ నీటిలో పిడికెడు చక్కెర, చిటికెడు ఉప్పువేసి తాగించాలన్నారు. దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సత్యానారాయణ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగించండి



పెద్దవాగులో దట్టమైన ముళ్ల పొదలు

అయిజ: పట్టణంలోని పెద్దవాగులో కొన్ని సంవత్సరాలుగా ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయి. వర్షాకాలంలో వాగులో వరద వస్తే వాగు చుట్టుపక్కల ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. ఇటీవల వాగుకు ఒక పక్కన కొంతమేర ముళ్లపొదలను తొలగించి వదిలేశారు. రెండో వైపున ముళ్ల పొదలు అదేవిధంగా ఉన్నాయి. వాగుకు రెండు పక్కల ముళ్ల పొదలు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



చింతలకుంటలో నేలపైనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంటలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ కంచెలు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామంలోని బీసీ కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను నేలపైనే ఏర్పాటు చేశారు. దీనికి తోడు కంచెలు నిరించలేదు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల నేలకు వాలిన విద్యుత్ తీగలు తగిలి పిల్లలు, మూగజీవాలు ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లను దిమ్మెలపై ఏర్పాటు చేయకపోవడం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.